క్లుప్తంగా

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ

జగిత్యాల: కార్పొరేట్ ఉద్యోగాలకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని ఎస్ఎస్వీ కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ అన్నారు. ఇటీవల కార్పొరేట్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొందితే కార్పొరేట్ ఉద్యోగాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు శివాజీ, అఖిల, శ్రీజ, ప్రవళిక, పూజిత, తేజస్విని, మానస, హర్షిని, మధుమిత, వైష్ణవి, దీక్షిత పట్టుదలతో చదివి రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ నరేశ్, ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంపై కథలాపూర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. పంటలకు పెట్టుబడి పెట్టిన ప్రతీ రైతుకు 50 శాతం లాభాలు వచ్చేలా ప్రధాని మోదీ మద్దతు ధరను పెంచారని పేర్కొన్నారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

జగిత్యాల: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను 2వ తేదీన అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల అంశం చేర్చడం శుభపరిణామమేనని, అమలు చేయడం లేదన్నారు. స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రాగుల రాజు, తన్నీరు సత్యం, భారతపు లింగారెడ్డి, ప్రేమ్‌కుమార్, ఉమేందర్, మల్లేశం, సత్తవ్వ, రాజు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో వచ్చే నెల 1న ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని శివాజీ మహారాజ్ సమితి సభ్యులు రాజేందర్, తిరుపతి, రాజేశ్ కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆవిష్కరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేశ్, రాజేందర్, మారుతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నూతన జంటకు ఎమ్మెల్సీ కవిత ఆశీర్వాదం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న కవిత

వెల్గటూర్: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ అల్లం దేవమ్మ కుమారుడి వివాహం ఇటీవల జరగగా, ఎమ్మెల్సీ కవిత శనివారం వారి ఇంటికి వెళ్లి నూతన జంటను ఆశీర్వదించారు. అనంతరం వెల్గటూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంచందర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆమె వెంట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రాలు

- పట్టణంలో 22 సీసీ కెమెరాలు
- ప్రధాన ఏరియాల్లో పని చేయని వైనం
- పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు

రాయికల్: పట్ దొంగతనాల నియంత్రణ, పోకిరీల బెడద అరికట్టేందుకు రాయికల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం రూ.20 లక్షల వ్యయంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలపై బల్దియా అధికారుల పర్యవేక్షణ, మెయింటనెన్స్ సరిగా లేకపోవడంతో సీసీకెమెరాలు పనిచేయడం లేదు. దీంతో రాత్రిపూట యువకులు గంజాయి మత్తులో వేగంగా వాహనాలు నడపడం, పట్టణంలో దొంగల బెడద తీవ్రతరం కావడంతో వారిని పట్టుకునేందుకు పోలీసులకు సవాల్‌గా మారాయి.

పనిచేయని సీసీ కెమెరాలు

రాయికల్ పట్టణంలో 12 వార్డులు ఉండగా, దొంగతనాల నియంత్రణ కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్, ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్, పాతబస్టాండ్, శివాజీచౌక్ వంటి ప్రధాన ఏరియాల్లో 22 సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణంలో రెండేళ్లుగా సీసీకెమెరాలు పనిచేయడం లేదు. పట్టణంలో దొంగతనాలు జరగడంతో పోలీసులకు సవాల్‌గా మారాయి. ఒకవైపు జిల్లా ఎస్పీ బల్దియాలో, గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా కృషి చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేయడంతో బల్దియాలో ఉన్న సీసీకెమెరాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ అధికారులు స్పందించి సీసీకెమెరాలను వినియోగంలోకి తెస్తే కొంత వరకైనా దొంగతనాలు, పోకిరీల బెడదను అరికట్టవచ్చని బల్దియా ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలు

పోకిరీల బెడద ఉంది



రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు ఏవీ పనిచేయడం లేదు. దీంతో పోకిరీల బెడద తీవ్రతరం అవుతోంది. పోకిరీలు విచ్చలవిడిగా తిరుగుతూ నానాహంగామా సృష్టిస్తున్నారు. ముఖ్యంగా దొంగతనాలు ఎక్కువ కావడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

– కోల రవి, రాయికల్

వినియోగంలోకి తీసుకువస్తాం



పట్టణంలో సీసీకెమెరాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడతాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వినియోగంలోకి తెచ్చి పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తాం. సీసీకెమెరాల ఏర్పాటుకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలి.

– సుధీర్‌రావు, ఎస్సై

పొంచి ఉన్న ప్రమాదం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలోని పోచమ్మగుడికి వెళ్లే రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగాఉంది. దీంతో గ్రామస్తులు పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి పక్కకు మార్చాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. పోచమ్మగుడికి వెళ్లే భక్తులు రహదారి గుండా వెళ్లేందుకు జంకుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సుందర్ రాథోడ్, ఏఈఈ- జగిత్యాల, సెల్ నం: 94910 58667

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అన్నారు. జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే ఆరోగ్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మల్యాల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వాతి ఆధ్వర్యంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు డ్రై డే నిర్వహించాలన్నారు. పరిసరాలు శుభ్రం ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని ఎంపీవో రామకృష్ణరాజు అన్నారు. మండలంలోనిపి అమ్మక్కపేట, డబ్బా గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు. ఖాళీ డబ్బాల్లో నీళ్లు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలుంటే దోమలు పెరిగి జ్వరాలు వస్తాయన్నారు. మురికాలువల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు సరిత, రవళి, రామకృష్ణ ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మల్లాపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీవో జగదీష్ అన్నారు. మండలంలోని హుస్సేన్ నగర్‌లో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని, వైద్య, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. నిల్వనీటిని తొలగించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, చేతులు కడుక్కోవడంలో మెలకువలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, మాజీ సర్పంచ్ సయ్యద్ హైదర్, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న అధికారులు

శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

జగిత్యాల: ప్రజాసమస్యలను లేవనెత్తడంలో శ్రీధర్ బాబు ముందంజలో ఉంటారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో ప్రధానపాత్ర పోషించారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. శ్రీధర్ బాబు జన్మదినం పురస్కరించుకుని జగిత్యాలలోని ఇందిరభవన్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావు కార్యాలయంలో నిర్వహించారు.

మల్లాపూర్ : శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు మండలంలోని ముత్యంపేట, వీవీరావుపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎలాల జలపతిరెడ్డి, పీసీసీ ఫిషర్మన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని పెగడపల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: వెల్గటూర్ మండల కేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక, నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జీవన్‌రెడ్డి

రాళ్లవాగు కుడికాలువ మరమ్మతు పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ మరమ్మతు పనులు శుక్రవారం ప్రారంభించారు. రాళ్లవాగు ప్రాజెక్టు కాలువను మరమ్మతులు చేయాలని ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించగా, కాలువను, ప్రాజెక్టును 10 రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. యుద్ధప్రాతిపాదికన పనులు చేసి ఆయకట్టుకు నీరందించాలని ఇంజినీరింగ్ అధికారులకు ప్రభుత్వ విప్ సూచించారు. దీంతో శుక్రవారం కాలువలో పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించే పనులను చేపట్టారు. ఏళ్లనాటి సమస్యకు మోక్షం లభించిందని ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కాలువలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న జేసీబీ

బీరప్ప స్వామికి మాజీ మంత్రి మొక్కులు



బీరప్ప ఆలయం వద్ద జీవన్‌రెడ్డి యాదవ, కుర్మలు

సారంగాపూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న శ్రీ బీరయ్య స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్న మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ తీరుపై ఆయన యాదవ, కుర్మలను అభినందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు చేకుట శేఖర్ యాదవ్ , గ్రామస్తులు ఉన్నారు.

'క్షయ' సకాలంలో గుర్తించి, చికిత్స పొందాలి

మల్యాల: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి, చికిత్స పొందాలని జిల్లా ఉప వైద్య,ఆరోగ్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ అన్నారు. మల్యాల మండలం రామన్నపేటలో శుక్రవారం టీబీ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు వారాలకుపైగా దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనపడితే వెంటనే క్షయవ్యాధి నిర్ధారణ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధికి ఉచితంగా మందులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, సూపర్‌వైజర్ రాజమ్మ, ఏఎన్ఎం కవిత, సుశీల, మంకిడి శ్రీనివాస్, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, ఎల్‌టీ రాజేందర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి

నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే చర్యలు

సారంగాపూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులను అమ్మాలని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి, ఎస్సై దత్తాద్రి అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు, మందులను కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఏఈవో వెంకటేష్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

రాయికల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్సై సుధీర్‌రావు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిష్టర్, బిల్‌బుక్‌లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణం

మల్లాపూర్: తహసీల్దార్ లకావత్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేశ్ సేవలు మరువలేనివని మెట్‌పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో బదిలీపై వెళ్లిన తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేశ్‌తో పాటు ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్ గుగ్గిళ్ల రమేష్‌గౌడ్‌లను సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిసినట్లు చైర్మన్ బద్దం గోపి, సీఈవో మంత్రి సతీశ్ శుక్రవారం తెలిపారు. సహకార సంఘం పరిధిలోని అమ్మక్కపేట, ఎర్దండి, డబ్బా, ఇబ్రహీంపట్నం, మూలరాంపూర్ గ్రామాల్లో 1,201 మందికి చెందిన రైతుల ధాన్యం 41,496.40 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. 696 క్వింటాళ్లు సన్నరకం వరి కొనుగోలు చేశామన్నారు. 90 శాతం మంది రైతులకు డబ్బులు ఖాతాల్లో జమ అయినట్లు వారు వివరించారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

మల్లాపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులు బడిబాట కరపత్రాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకరించాలని, ఆహ్లాదకరమైన వాతావరణం, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మల్లాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ఎకీన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2000–01 సంవత్సరం ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల ఒకే వేదికపై కలుసుకుని తమ మంచి చెడు పంచుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం 2025–2026 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియేట్‌కు అప్‌గ్రేడ్ అయ్యిందని, ఇంటర్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సులో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు. మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ కోర్సుకు అనుమతి లభించిందని, కంప్యూటర్ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, దశలవారీగా అన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 9550710567,9652954685 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

ధర్మపురి: పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో జూన్ 6 లోపు విద్యార్థులు తమ ధృవీకరణ పత్రాలను సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి సీటు రాని విద్యార్థులు బీఏ (ఈపీఎస్), బీకాం (సీఏ), బీ ఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ (ఎంఎస్‌టీసీఎస్), బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ (ఎంపీసీఎస్)లో అ డ్మిషన్ల కోసం కళాశాల సెల్ : 8019429413 ఫోన్‌లో లేదా స్వయంగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధిలోకి వచ్చే వాణినగర్, బీట్‌చౌరస్తా, నటరాజ్‌చౌరస్తా, తులసీనగర్, గీతవిద్యాలయం, ఎల్ఎల్ గార్డెన్ ఏరియాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ రాజిరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

జగిత్యాలరూరల్: రైతులు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై గ్రామసభలు

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా జూన్ 3 తేదీ నుంచి 18వ తేదీ వరకు భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు మేడిపల్లి,భీమారం తహసీల్దార్లు మునిందర్, రవికిరణ్ తెలిపారు. 15 రోజులు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని రైతులు తమ భూ సంబంధిత సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు.

లింగంపేటలో పౌరహక్కుల దినోత్సవం

మేడిపల్లి: భీమారం మండలంలోని ఈదుల లింగంపేటలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో కుల, లింగ వివక్ష, పౌరుని ప్రాథమిక హక్కులు, పౌరుని స్వేచ్ఛ హరించే విషయాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాజరాం, కిరణ్‌కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీలో పశువులు, కోళ్ల షెడ్లు నిర్మాణం

కథలాపూర్: మండలంలోని రైతులకు ఉపాధిహామీ పథకంలో సబ్సిడీపై పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, ఫాంపాండ్‌లు నిర్మించుకోవచ్చని, ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో రాజేందర్ శుక్రవారం పేర్కొన్నారు. ఉద్యానవన పంటల సాగుకు ఉపాధిహామీ పథకంలో సబ్సిడీ ఉందన్నారు. రైతులు ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు ఉండి 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారు అర్హులన్నారు.

రెండు బైకులు ఢీ దంపతులకు గాయాలు

ధర్మపురి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులకు గాయాలైన ఘటన శుక్రవారం నర్సయ్యపల్లె క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన రాజన్న లక్ష్మి అనే దంపతులు తన కుమారుడితో కలిసి తుమ్మెనాలకు వెళ్తున్నారు. నర్సయ్యపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో భార్య భర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్సులో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.